క్లుప్తంగా

వృద్ధులకు సేవ దైవకార్యం



వృద్ధాశ్రమానికి అందించిన నిత్యావసర వస్తువులతో సీఐ వెంకట రమణ

ప్రొద్దుటూరు కల్చరల్ : వృద్ధులకు సేవ చేయడం దైవకార్యమని త్రీటౌన్ సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో రూ.20 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులను సీఐ చేతుల మీదుగా అందజేశారు. ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ వారు తాము సంపాదించిన దానిలో కొంత ఆశ్రమంలోని వృద్ధులకు అందివ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో మీ కోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, బాసట సేవా సంస్థ సభ్యుడు ఈశ్వరయ్య, ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, ఆశ్రమ వ్యవస్థాపకుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో బెజవాడ రమణమ్మ మూడవ వర్ధంతి సందర్భంగా అమ్మ హెల్పింగ్ హ్యాండ్ కువైట్ వారి ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, మల్లి యాదవ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

20 నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

గోపవరం : మండలం పరిధి గోపవరం గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బద్వేలు దేవదాయశాఖ ఈవో శివయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న అంకురార్పణ, శ్రీకృష్ణఅవతారం, 21న ధ్వజారోహణం, హనుమంతోత్సవం, శ్రీరామఅవతారం, 22న గరుడోత్సవం, మోహినీ అలంకారం, 23న కల్యాణ మహోత్సవం, గజవాహనం, శ్రీకృష్ణ అవతారం, 24న రథోత్సవం, 25న వసంతోత్సవం, అశ్వవాహనం, పగలు శ్రీచక్రస్నానం, రాత్రికి ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 24న శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ ఉంటుందన్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గొడవపడితే జైలుకు పంపుతాం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ, రూరల్ మండలంలో ఎవరైనా గొడవపడితే వెంటనే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ హెచ్చరించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ గొడవల నేపథ్యంలో గురువారం అర్బన్ సీఐ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీల వారు ఎవరైనా సరే, ఎంతటి వారైనా గొడవలు పెట్టుకొని కొట్టుకుంటే అలాంటి వారిపై హత్యాయత్నం వంటి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి వెంటనే రిమాండ్‌కి తరలించి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రౌడీ షీట్స్ ఓపెన్ చేసి పట్టణ, మండల, జిల్లా బహిష్కరణ చేస్తామని పేర్కొన్నారు. మైదుకూరు మున్సిపాలిటీ, రూరల్ మండలంలోని ప్రజలు ఎవరూ గొడవలు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్యలుంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు మంజూరు

కలసపాడు : మండలానికి 40 క్వింటాళ్ల జీలగలు, 5 క్వింటాళ్ల జనుములు, 4 క్వింటాళ్ల పిల్లి పెసరాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు. మండలంలో వరి సాగు చేసే రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ తీసుకుని దగ్గరలోని రైతుభరోసా కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. జీలగలు, జనుములు క్వింటా ధర రూ.8800 కాగా 50 శాతం ప్రభుత్వ రాయితీ పోను రైతు వాటాగా రూ.4400 చెల్లించాలన్నారు. అలాగే పిల్లిపెసరాలు క్వింటా ధర రూ.13400 కాగా 50 శాతం ప్రభుత్వ రాయితీ పోను రైతు వాటాగా రూ.6700 చెల్లించాలన్నారు. జీలగలు సాగు చేసుకోవడం వల్ల నేల సేంద్రియ కర్బనం పెరుగుతుందని, నేలకు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు అందుతాయని తెలిపారు. జీలుగల వల్ల చౌడు భూముల్లో చౌడు విరిగిపోతుందన్నారు. కావున రైతులు పచ్చిరొట్ట ఎరువులను వినియోగించుకోవాలని కోరారు.

ఉచితంగా వడుగులు

కడప కల్చరల్ : అమీన్ ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ కేఎస్ఎస్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం దర్గా సమీపంలోని నజ్ముల్ అమీన్ పబ్లిక్ స్కూలులో ఉచితంగా వడుగుల (ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప నగరంతోపాటు సమీప ప్రాంతాల నుంచి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 58 మంది బాలలకు ఖత్నా నిర్వహించారు.

అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్‌రోడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి బాలబాలికలకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. తమ కళాశాలలో సైన్సు, ఆర్ట్స్‌తోపాటు ఒకేషన్(సీఎస్‌సీ) గ్రూపు కూడా ఉన్నట్లు తెలిపారు. ఇంటర్‌లో చేరబోయేవారికి కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి అడ్మిషన్ కోసం అప్లికేషన్స్ ఇస్తామని తెలిపారు.

మఠం.. ఉత్సవ శోభితం

- ఈశ్వరీదేవిమఠంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు
- ఘనంగా ఏర్పాట్లు



ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన దృశ్యం



విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శ్రీఈశ్వరీదేవికి జేజినాయన అయిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. దేవాలయంతోపాటు పరిసరాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ప్రాంగణంలో శోభాయమానంగా రంగవల్లులు వేశారు. ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో నిర్వహించిన కార్యక్రమాలకు ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటసుబ్రమాణ్యాచార్యులు ఆధ్వర్యం వహించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ టీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

ప్రత్యేక బస్సులు

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో నుంచి బ్రహ్మంగారిమఠానికి పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. మైదుకూరు నుంచి వనిపెంట, మిట్టమానుపల్లె మీదుగా 7 బస్సులు, మైదుకూరు నుంచి మల్లేపల్లె మీదుగా 15 బస్సులను నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మంగారి మఠం నుంచి జ్యోతి క్షేత్రానికి 2 ప్రత్యేక బస్సులను ఈనెల 19వ తేదీ వరకు నడుపుతామని తెలిపారు.

బద్వేలు అర్బన్ : బ్రహ్మంగారిమఠంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరగనున్న శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన గురుపూజోత్సవాలకు బద్వేలు ఆర్టీసీ డిపో నుంచి 12 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి ఆచారి భక్తులకు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రి స్వామి, మఠం ఫిట్‌పర్సన్ శంకర్ బాలాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ ఈశ్వరాచారి, విశ్వబ్రాహణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలకు భారీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

బ్రహ్మంగారిమఠం : శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ తెలిపారు. ఉత్సవాలకు జిల్లా నుంచి ప్రత్యేక అధికారిగా వచ్చిన ఉపాధి పీడీ యదుభూషణ్‌రెడ్డితో కలిసి గురువారం బి.మఠంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన అధికారుల సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ గత ఉత్సవాలకు కొన్ని ఇబ్బందులు కల్గడంతో ప్రస్తుతం జరుగుతున్న ఉత్సవాలకు ఎండోమెంట్ ఏసీ, దేవస్థానం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజీ, మఠం మేనేజర్ ఈశ్వరాచారి ప్రత్యేక దృష్టి పెట్టి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా ఇతర అధికారులు కూడా వారికి కేటాయించిన పనులను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అనంతరం పీడీ యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలకు కలెక్టర్ ఆదేశాల మేరకు తనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రధానంగా భక్తులకు తాగునీరు, పరిశుభ్రత, చలువ పందిర్లు, దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. దేవస్థానం నిర్వాహకులకు అధికారులు సహకరించి వారికి తోడుగా ఉండి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ప్రధానంగా స్థానిక ఎస్‌ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తారని తెలిపారు. వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరా చారి, ఎంపీడీఓ మల్లేశ్వరప్ప, డీటీ జాన్స్, ఎస్‌ఐ విద్యాసాగర్, ఆర్టీసీ, ఎక్సైజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, అగ్నిమాపక శాఖ, ఆరోగ్యం, ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : పరిసరాల పరిశుభ్రతతో డెంగీ వ్యాధిని నివారించవచ్చని పోరుమామిళ్ల సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి బి.కోడూరు గ్రామ వీధుల్లో డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అర్థమయ్యేలా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, దోమలార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, స్టాఫ్‌నర్స్ సునీత, ఏఎన్‌ఎం కె.కుమారి, భారతి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, ఫార్మాసిస్టు వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విజ్ఞాన శి బిరాన్ని సద్వినియోగం చేసుకోండి



పోరుమామిళ్ల: వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆడుకుంటున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఆఫ్రిది, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్, దాదాపీర్, ఖాశింవలి తెలిపారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులను గ్రంథాలయానికి రప్పించి వారిలో విజ్ఞానం పెంపొందించేందుకు ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 7 వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు దినవార పత్రికలు, మహానుభావుల జీవితచరిత్రలు, జనరల్ నాలెడ్జి, కథల పుస్తకాలు తదితరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గణిత ఉపాధ్యాయురాలు ఎస్.నిర్మల జ్యోతి తెలిపారు. రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. గురువారం విద్యార్థులకు గణిత ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి అంకెలు, సంఖ్యలు, కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం గురించి వివరించారు. పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం వేమన పద్యాలు చెప్పి భావాల గురించి తెలిపారు. విద్యార్థులచే చెస్, క్యారంబోర్డు ఆటలను ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, రవిబాబు, రెహమాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.

19 నుంచి నత్తడ్ షావలీ ఉరుసు



నత్తడ్ షా వలీ దర్గా



నత్తడ్ షా వలీ సమాధి

ఖాజీపేట : మత సామరస్యానికి ప్రతీకగా, వైభవంగా నిర్వహించే నత్తడ్‌షా ఉరుసు ఉత్సవాలు 19 నుంచి మొదలు కాబోతున్నాయి. ఖాజీపేట టౌన్ అగ్రహారంలో కొలువైన శ్రీ హజరత్ ఖాజీ సయ్యద్ నత్తడ్‌షా వలీ ఉరుసు ఉత్సవాలు 19వ తేదీన నషాన్ కార్యక్రమంతో మొదలు అవుతాయి. 20న ఖాజీపేటలోని సిద్ధారం ఖదీరుల్లా ఇంటి నుంచి గంధం కార్యక్రమం ఉంటుంది. 21న సర్వర్‌ఖాన్ పేట నుంచి జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారు. 22న జియారత్ తహలీల్ ఫాతేతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయి. గంధం ఉరుసు సందర్భంగా అన్వర్ జానీ, సర్ఫరజ్ సాబ్రి చే ప్రత్యేకమైన ఖవ్వాలి ఉంటుంది. ఈ ఉత్సవాలను ఉరుసు ఉత్సవ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వయోజనుల కోసం బీసీజీ టీకా



ప్రొద్దుటూరు క్రైం : బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



బద్వేలు అర్బన్ : వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ రమేష్

ప్రొద్దుటూరు క్రైం : క్షయ వ్యాధి రావడానికి అవకాశం ఉన్న 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా ఇస్తున్నట్లు అర్బన్ వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి తెలిపారు. స్థానిక బాపూజీనగర్, కెహెచ్‌ఎం స్ట్రీట్‌లలోని సచివాలయాల్లో గురువారం వయోజన బీసీజీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బీసీజీ టీకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి రావడానికి అవకాశం ఉన్న పెద్దలకు ఈ టీకా ఇవ్వడం ద్వారా కొత్త క్షయ వ్యాధి కేసుల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. 60 ఏళ్లు పై బడిన వారితో పాటు గత ఐదేళ్లలో క్షయ వ్యాధి కలిగిన వ్యక్తులకు, క్షయ వ్యాధి కేసు కలిగిన కుటుంబ సభ్యులకు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువ ఉన్న వారికి బీసీజీ టీకా ఇస్తారని చెప్పారు. ఈ టీకా ఎంతో సురక్షితమైందని, అర్హులైన వ్యక్తులందరూ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు సునీత, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీరోడ్డులోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న 6 సచివాలయాల్లో వయోజన బీసీజీ టీకాను వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం, సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, టీబీ హెచ్‌వీ సిద్ధారెడ్డి, ఏఎన్‌ఎంలు మల్లేశ్వరమ్మ, రెబకా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ..

కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని పలు సచివాలయాల్లో వయోజనులకు బీసీజీ టీకాను ప్రారంభించారు. మొదటి రోజు 437 మందికి టీకాలు వేశామని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్ వైజర్లు బీవీ వరప్రసాద్, చంద్రకళ, ఫార్మసిస్టు శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి నివారణ

బద్వేలు అర్బన్ : బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి నివారణ సాధ్యమవుతుందని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం నుంచి ప్రారంభమైన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు పైబడిన వారందరికీ అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగతాగే వారికి, గతంలో టీబీ వచ్చిన వారికి, 60 సంవత్సరాలు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు వెంకటరమణ, నవీన్‌కుమార్, వైద్యాధికారులు డాక్టర్ జోత్స్నస్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ చంద్రావతి, పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ ఘన విజయం'



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని పీఆర్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్న రెండవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. నారా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, పచ్చమీడియా రామోజీ, రాధాకృష్ణ, టీవీ5, షర్మిల తదితరులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఎల్లో మీడియా ఎంతగా అబద్ధపు ప్రచారం చేసినా ప్రజలు జగన్ వెంటే ఉన్నారని అన్నారు. ఎన్నికల్లో కూటమి ఎన్ని అరాచకాలకు పాల్పడినా పోలీసులు చూస్తూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల కమిషన్ కూటమి ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులను బదిలీ చేసిందని, టీడీపీ వారి దౌర్జన్యాలపై చర్య లేదన్నారు. బద్వేలులో డాక్టర్ సుధ భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని, రాష్ట్రంలో 120 నుంచి 150 అసెంబ్లీ సీట్లు, 20కి పైగా పార్లమెంటు సీట్లు వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకుంటుందని ఆయన వివరించారు.

వర్షం కోసం ప్రార్థనలు

కడప కల్చరల్ : కడప నగరం బిల్డప్ సమీపంలోని న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో గురువారం పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో సకాలంలో వర్షాలు కురవాలని భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ మహేష్ మాట్లాడుతూ మానవాళితోపాటు సకల జీవరాశులు జీవించేందుకు నీరు కావాలన్నారు. వర్షం కురిసినపుడే రైతులు పంటలు పండించగలరని, తాగునీరు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్వాసులు పి.రవితేజ, శాంతిరాజు, అశోక్, అగస్టిన్, నరసయ్య, ఏ.రవి, రోజా, లీలావతి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం అందజేసింది. కడప, కోడూరుకు చెందిన ప్రణవి, మాధవి తిరుపతి, పుత్తూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో 3, 4 సంవత్సరాలు బీటెక్ చదువుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఆటంకం ఏర్పడిన సందర్భంలో కడపకు చెందిన బాసట సంస్థ సభ్యులు డీఏ కార్తీక్ రెడ్డి, వారి మిత్రులు ప్రణవికి రూ. 15 వేలు, మాధవికి రూ. 20 వేలు చెక్కు రూపంలో అందజేశారు.

బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్

పులివెందుల రూరల్ : బీటెక్ రవి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. గురువారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీటెక్ రవి మీడియా ముందు మాట్లాడుతూ పథకాల డబ్బులను జగన్ వేయడం లేదని అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీటెక్ రవి చిత్తశుద్ధితో నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, సోఫాలవీరా, రత్నం, హనుమంతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాలపోలేరమ్మ తిరునాల

కడప కల్చరల్ : కడప నగరం చిన్నబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి సోమవారం వరకు జాతర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 17న ఉదయం 7.00 గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి లలిత సహస్రనామ పఠనం, మహా మంగళ హారతి నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు అమ్మవారికి చల్లసమర్పణ, రాత్రి 7 గంటల నుంచి సామూహికంగా భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పణ ఉంటుంది. 9 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం ఉంటుంది. 19న ఉదయం 7 గంటల నుంచి అమ్మవారికి బోనాల సమర్పణ, సాయంత్రం 5 గంటల నుంచి పానకం సమర్పణ నిర్వహిస్తారు. 20న ఉదయం 7 గంటలకు మహానైవేద్యం, రాత్రి 7 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

నేటి నుంచి శ్రీ వాసవీ కన్యకాంబ జయంతి

కడప కల్చరల్ : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి జయంతి ఉత్సవం శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు శ్రీ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు కన్యకలకు మంగళ స్నానం, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవీ మాత వ్రతం నిర్వహిస్తారు. 18న ఉదయం 6 గంటలకు 102 మంది కన్యకలు క్షీర కలశాలతో పాండురంగస్వామి ఆలయం వద్దనుంచి ఊరేగింపుగా అమ్మవారి శాలకు చేరుకుని ఆ కలశాలలోని క్షీరంతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 8.30 గంటలకు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 10.30 గంటలకు శ్రీ వాసవీ హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 1.00 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు అమ్మవారిని పూల పల్లకీలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. 19న ఉదయం 7 గంటలకు పేదలకు అన్నదానం నిర్వహిస్తారు.

ధరాభారం





కడప అగ్రికల్చర్: జిల్లాలో కూరగాయలు ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నమొన్నటి వరకు కిలో రూ. 30 ఉన్న పచ్చిమిరపకాయల ధర ఒక్కసారిగా ఘాటెక్కి కిలో రూ. 70 చేరింది. ఇక అల్లం ధర మాత్రం ఎప్పటి నుంచో అలాగే కొనసాగుతోంది. కిలో అల్లం ధర రూ. 170 ధర పలుకుతుంది. అలాగే బీన్స్‌కూడా కిలో రూ. 75 ధర ఉంది. రైతు మార్కెట్‌లో టమాటా, వంకాయలు తప్ప మిగతా అన్ని కూరగాయలు కిలో రూ. 40 ధర పలుకుతున్నాయి. ఇందులో కాప్సికమ్ కిలో రూ. 60, నాటు కాకరకాయ కిలో రూ. 60, బీరకాయలు, అలసందలు కిలో రూ. 55, చిక్కుడుకాయ, అనపకాయ, క్యారెట్‌లు కిలో రూ. 50, బంగాళదుంప కిలో రూ. 46, కాలీఫ్లవర్ కిలో రూ. 45, దొండకాయ కిలో రూ.44, క్యాబేజీ, బీట్రూట్, మట్టికాయలు, బెండకాలు, మునక్కాయలు కిలో రూ.40 ధర పలుకుతున్నాయి. టమాట, వంకాయలు మాత్రమే కిలో రూ. 20 ఉన్నాయి.